కథానిక

# కథా వ్యాంసకుడు

"సత్యశ్రీ"

"ఈ మధ్యన ఏమీ వ్రాయడంలేదు—ప్లాటేమీ తట్టడంలేదా?" అన్నాడు ప్రకాశరావు.

నిజమే! ఈమధ్యన ఏమీ వ్రాయటంలేదు. కథలు అల్లాలంటే మంచి 'ప్లాటు'ను సంపాదించుకోవాలి. మంచి ప్లాటు కోసం బాగా ఆలోచించాలి. ఆలోచించినా, పాత 'వస్తువే' కాని కొత్త ప్లాటు దొరకటంలేదు ఖర్మ! అందుకనే ప్రకాశరావు అంటూవుంటాడు అప్పుడప్పుడూ "నీ మెదడు చాలా మందకొడిదోయ్!" అని. నేను కాదనలేను.

భద్రాచలంలో ఉద్యోగం దొరికించుకున్న ఈ ఆరు, ఏడు నెలలమధ్యనే ప్రకాశరావుతో ఎక్కువగా పరిచయ మేర్పడింది, ఆఫీసు వర్కు తెలియని మొదటిరోజుల్లో కాస్త సహాయం చెయ్యటానికిగాని, సలహా యివ్వడానికిగాని విసుక్కునే వాడు ప్రకాశరావు. అయితే రానురాను చాలా మంచివాడని పించుకున్నాడు.

ప్రకాశరావు చాలా గంభీరంగా, భావకుడిలా వుంటాడు. 'పవర్ గ్లాసు'ల్లోనుంచి అతని కళ్ళు ఎంతో గంభీరంగా కనిపిస్తయ్. తన అనుభవాలు, యితరత్రా జరిగిన విచిత్రవ్యక్తుల చరిత్రలు మొదలైనవి ఏకరువు పెట్టుకొస్తూ, "యిందులో నీకు కావలసినన్ని యితివృత్తాలు దొరుకుతవి మంచివి చూచి ఏరుకుని కథలు అల్లు!" అంటూ వుంటాడు. అయితే ప్రకాశరావు చెప్పగలడేగాని రాయలేడు. ప్రకాశరావు చెప్పేకథల్లో రాయటానికి బాగుండే మంచి యితివృత్తాలు, చక్కని ప్లాట్లుకూడా దొరకడంకద్దు.

సాయంత్రం గోదావరి యిసుక తిన్నెమీద కూర్చున్నాము ప్రకాశరావూ, నేనూ అప్పుడే ఆపై ప్రశ్న వేసాడు ప్రకాశరావు.

సాయింత్రంపు నీరెండ రమణీయంగా పడుతోంది. నదిపైనుంచి చల్లటి గాలి హాయిగా వీస్తోంది. నీలాటి రేవుకి యిరవై, ముప్పై గజాల దూరంలో కూర్చొన్నాం. ప్రక్కవాటుగా తల త్రిప్పి చూస్తే, నిండు బిందె నీళ్ళతో మెట్లెక్కిపోయే వనితలు గొల్లభామల్లా వయ్యారంగా గోచరిస్తారు.

"నువ్వేదన్నా మంచి 'ప్లాటు' చెప్పకూడదూ?" అన్నాను ప్రకాశరావు కేసిచూస్తూ, ప్రకాశరావు నవ్వాడు. సమాధానం ఏమీ యివ్వలేదు, అవతలి వడ్డునుంచి, యివతలికి తరంగాలమీద జోగుతూ వచ్చే పడవకేసి చూస్తూన్నాను నేను. ఏదో గుర్తుకొచ్చినట్టు ఉలిక్కిపడ్డాడు ప్రకాశరావు.

"యిదిగో! శ్రీనివాసరావ్! ఆవచ్చే అమ్మాయిని ఎరుగుదువుకదూ? వెంట చిన్న పాపవుంది బుడ్డిచెంబుతో నీళ్ళు పట్టుకుని చూడు!" అన్నాడు ప్రకాశరావు కళ్ళజోడును తీస్తూ.

అటువైపు చూచాను. పద్ధెనిమిది సంవత్సరాలుంటాయి ఆమెకు చాలా అందంగావుంది. నిగనిగ మెరిసే కూజాబిందెను చంకనెత్తుకుని, నది నుంచి వస్తోంది. పసుపువన్నె ఛాయ నీరెండలో మెరుస్తోంది. ఆమె స్నానంచేసి వస్తోందేమో, లేత నీలివర్ణపు కోక శరీరానికి అంటుకుపోయి నీళ్ళు కారుతోంది. అక్కడక్కడ తెల్లదారంతో కుట్టిన పువ్వులున్నాయి కోకమీద. ముడివేసుకున్న తడిజుట్టులోనుంచి వీపుమీదకు నీరు కారుతోంది. ఆమె వెనకాలే మూడు, నాలుగు సంవత్సరాలున్న పాప, చిన్న బుడ్డిచెంబుతో నీళ్లు పట్టుకుని వస్తోంది. మధ్యమధ్యన పట్టుకోడం చేతరాక కాబోలు గౌనంతా తడుపుకుంటోంది పాప.

యింతలోనే ఆమె మమ్మల్ని సమీపించి, క్షణంలోనే దాటిపోయి కొన్ని గజాలదూరం వెళ్ళి, అక్కడ ఆగి వెనక్కు తిరిగి ఆగింది పాపకోసం గాబోలు. బుడ్డిచెంబు యిసుకలోపెట్టి రంగురాళ్లు ఏరుకుంటూన్న పాప, ఏరుకున్న రాళ్ళను గౌను

జేబులో పోసుకుని, మళ్ళ పరుగెత్తుకెళ్ళి ఆమెతో కలుసుకుంది నీళ్ళన్నీ వలకబోసుకుంటూ. పాపం ఆమె ఏమీ మాట్లాడలేదు. ఇద్దరూ కలసి, మెట్లెక్కి-గట్టుమీదకెళ్ళి అంతర్ధనమై పోయారు. అంత వరకు మేమిద్దరం అటువైపే చూస్తూన్న మాట వాస్తవం!

"బహుశ చూచేవుంటావేమో సరీగా గుర్తు లేదు—ఏం.? ఎవరేమిటి ఆమె? వెంటఉన్న పాప ఏమవుతుంది ఆమెకు? కూతురా?" అన్నాను అటు నుంచి దృష్టిని మరల్చి ప్రకాశరావు కేసిచూస్తూ.

ప్రకాశరావు ముఖకవళికలను గంభీరంగా మార్చాడు. దానిలో ఏవో వ్యక్తంకాని నిగూఢ భావాలు పొర్లుతున్నై.

"ఆమేనా? ఆమె" అంటూ కళ్ళజోడు తీసి సిల్కు-లాల్చీతో తుడిచి మళ్ళీ పెట్టుకుని అన్నాడు "సుమారు రెండు సంవత్సరాలు అవుతుంది వూర్లో వుంటూండి. తెలంగాణా ప్రాంతంనుంచి వలస వచ్చారు పాపం!"

"ఊహూఁ! ఆమె భర్త యిక్కడ ఏదన్నా పని చేస్తూన్నాడా యిక్కడకు వలస రావలసిన కారణం?" అన్నాను నేను.

ప్రకాశరావు పెదవివిరచి, నిట్టూర్చాడు. "ఆమె భర్త పోయి యిప్పటికి రెండేళ్ళు అవ్వొస్తోంది! అంటే వూరుచేరుకున్న వారం పది రోజుల్లోనే పోయాడు పాపం! మరో విషయం ఆమె మూగది! అసలు ఏ మాత్రమూ శబ్దం చెయ్యలేదు నోటితో!"

నేను ఉలిక్కిపడ్డాను. ఆమె మూగది! పైగా వితంతువు! ఎటువంటి దురదృష్టం?

నా ముఖంలో భావాన్ని కనిపెట్టి ప్రకాశరావు గంభీరంగా చిరునవ్వు నవ్వాడు.

"మధ్యలో వచ్చిందికాదు ఆ మూగ పుట్టుక నుంచీ వుందట!"

ఆమె రూపం మళ్ళీ మళ్ళీ గుర్తుచేసుకున్నాను మనస్సులో. చాలా చక్కటి అమ్మాయి. ఆమె సౌందర్యానికి తగట్టు, మూగది కాకుండావుంటే ఎంత ఆనందపడేది? తనలోపానికి ఆమె ఎంత విచారిస్తూ వుంటుందో పాపం? నిజంగా ఆమె భర్త చాలా సహృదయుడై వుండాలి. లేందే మూగ పిల్లను వివాహం చేసుకుందుకు ముందుకొచ్చేవాళ్ళు చాలా అరుదు. అయినా ఏంలాభం? ప్రస్తుతం ఆమె వితంతువు!

మసకమసగ్గా తెల్లమబ్బులోనుంచి వెన్నెల కాస్తోంది. యిసుకపర్ర మీదనుంచి నదిలోకి చొచ్చుకుపోయిన నల్లరాళ్ళగుట్టలు మరీ నల్లగా కనిపిస్తున్నై దూరంగా. రేవులో కట్టివేసిన పడవలకి తరంగాలు గుద్దుకుంటూ చప్పుడుచేస్తూన్నై.

"ఏం...? శ్రీనివాసరావ్? అప్పుడే అల్లేస్తూన్నట్టున్నావు కథ ఆమె మీద అవునా? వుండు పూర్తిగావిను నీకు చక్కటి ఇతివృత్తం కల్పిస్తాను. చెప్పనా?" అన్నాడు ప్రకాశరావు.

నాకు యితివృత్తం దొరుకుతుందనే కుతూహలం కన్నా, నిజంగా ఆమె గురించి విశదంగా తెలుసుకోవాలనే వాంఛ రేగింది ఎక్కువగా.

"చెప్పు...వింటాను...!" అన్నాను నేను.

ప్రకాశరావు మొదలుపెట్టాడు ముఖం గంభీరంగా మార్చి; "విను ఆమె తెలంగాణా ప్రాంతం నుంచి వచ్చింది అన్నాను కదూ? అక్కడవాళ్లు సామాన్యకుటుంబీకులు కారు—ఉన్నత వంశీకులు మన తెలుగువాళ్ళే చూడు ఆమధ్యన తెలంగాణాలో రజాకార్ల దోపిడీలు జరిగాయి ఆరోజుల్లోనే వీళ్లు కాందిశీకులుగా యిక్కడకు వలస వచ్చారు. ఈమె తండ్రిని, తమ్ముణ్ని నడిబజార్లో పెట్టి కాల్చి వేశారు పాపం!" అని ప్రకాశరావు నా ముఖంకేసి చూచాడు. నావళ్ళు గగుర్పొడిచింది. నిజంగా యిటువంటి సంఘటనలు వింటానికే యింత భయంకరంగా వున్నప్పుడు చూస్తూంటే మహాదారుణంగా వుంటాయి. "ఘాతకులు?" అన్నాను నేను ఉద్రేకంగా ప్రకాశరావు మళ్ళీ చిరునవ్వు నవ్వాడు. ఇటువంటి విషాదమైన సంఘటనలు చెప్పుకొస్తూ ప్రకాశరావు నవ్వుతాడే? మతిపోయింది ప్రకాశరావుకు...! నిజమే! కాకపోతే మరెందుకానవ్వూ...?

వెంటనే సంబాళించుకుని మళ్ళీ మొదలుపెట్టేడు ప్రకాశరావు గంభీరంగా. ప్రస్తుతం మనం చెప్పుకునే కథలో నువ్వుచూచిన వ్యక్తి వచ్చిన క్లిష్టపరిస్థితిని ఊహించుకుని నువ్వు అంతగా బాధపడుతూన్నావుగాని, మనకు తెలియని వాళ్ళ పరిస్థితులు గమనించావుకాదు. ఆ రోజుల్లో ఇంతకంటే హీనంగా వుండేవి! యిక అది అలా వది

లెయ్. మన కథలోకి వద్దాము. ఆమె భర్తకు కూడా 'ఫైరింగ్'లో దెబ్బతగిలింది కాని, అది వెంటనే ఏమీ ప్రమాదాన్ని తేలేదు. ఇక అక్కడ వుండటం శ్రేయస్కరం కాదనుకుని, ఆమె భర్తా, ఆమె తల్లి, యిందాక ఆమె వెంటనడచి వెళ్ళిన పాప—ఆ పాప ఆమె మొదటికూతురు. అంతా కలసి, రాత్రులు ప్రయాణాలు సాగిస్తూ, కొండలు కోనలు దాటుతూ ప్రయాణం సాగించారు. ఆ రోజుల్లో ఆమె నిండుగర్భిణీ! కనే నెలలు దురదృష్ట వశాత్తూ ఆమె మధ్యదారిలోనే ఒక ప్రదేశంలో కన్నది! అయితే పాపం ఆపాప బ్రతకలేదు! వెంటనే పోయిందట!"

ప్రకాశరావు ఆగాడు. నాకు ఏవిధమైన ప్రశ్నలూ వెయ్యబుద్ధి కాలేదు. నిరుత్సాహంలో ఒక విధమైన ప్రశాంతత ఏర్పడిపోయి వింటూ వుండి పోయాను అంతే.

ప్రకాశరావు నావంక ఒకసారి చూచి మళ్ళీ మొదలుపెట్టేడు కథను: "సరే! వాళ్ళు అలానే నా బాధలు పడుతూవచ్చి చివరకు గోదావరీ నదినిదాటి ఈ వూరు చేరుకున్నారు. ఆ రోజుల్లో వీళ్ళొక్కళ్ళేకాదు. చాలామంది శరణార్థులు వలసవచ్చారు ఆ ప్రాంతంనుంచి.

మొదట వీళ్లు ఇక్కడకు రాగానే మా ఇంటికే వచ్చారు ఆ రాత్రి. మేము మొదట్లో వీళ్ళకు చాల సహాయం చేశాము. అయితే ఇక్కడకొచ్చిన వారం రోజులలోపులో ఆమె భర్తకు ప్రక్కలో తగిలిన దెబ్బ పెద్దదికావటం, యిక్కడ హాస్పిటల్ లో జాయిన్ కావడం, లోన యిరుక్కున్న 'బాల్'ను తియ్యటానికి ఆపరేషన్ చెయ్యడం, దురదృష్టవశాత్తూ అది ఫేలయిపోయి అతను మరణించడం జరిగిపోయింది! నిజంగా వాళ్ళు అనుభవించిన కష్టాలు, చూచిన ఘోరపు కృత్యాలు చెబుతోంటే మనకు చాలా దుఃఖం వచ్చేస్తుంది." అని ఆపుచేసాడు ప్రకాశరావు.

నేను గోదావరికేసి చూస్తూ మౌనంగావుండి పోయాను, గోదావరికి అవతలగా కొంతదూరం యిసుకపర్రదాటిన తరువాత తగిలే తెలంగాణా తీరపు సరిహద్దులు వంకరటింకరగా, ఎత్తుగా మెలికలు తిరిగి, ఆ మసక వెన్నెల్లో గంభీరంగా, భయంకరంగా, కనిపిస్తునై. అటువైపు చూచిన కొద్దీ ఆమెచరిత్ర, స్థితిగుర్తు కొస్తూంది మాటిమాటికి. నిజంగా ఆ విషాద సంఘటనలు మర్చిపోలేము.

ఆమె అబల! పురుష అండలేని స్త్రీ. ఆమెతో తన తల్లి, పాప వీళ్ళబ్రతుకు తెరువు ఎలా గడుస్తూందో? ముగ్గురూ స్త్రీలే. చిన్నపాప...!

ఈ సంశయమే తీర్చమని ప్రకాశరావుని అడిగితే. అతను అన్నాడు!" ఏముంది శ్రీనివాసరావ్, యిద్దరూ ఆడవాళ్లేకదా? ఆమె వంటిమీద మిగిలిన కొద్దో గొప్పో నగలు తెగనమ్మి చిన్న కిరాణాకొట్టు పెట్టింది తల్లి. ఆమె కూడా మోతుబరుల యింట్లో చిన్నచిన్న పనులుంటే చేస్తూ పొట్టకోసం పాటుపడుతూ యిక్కడే వుండిపోయారు శాశ్వతంగా. రేపుచూపుతాను వాళ్ళఇల్లు."

యిది విన్నతరువాత మరీ కృంగిపోయాను. ఆమెను చూస్తూంటే ఉన్నత కుటుంబంలో పుట్టిన వనితలా వుంది. వుంటమేమిటి ప్రకాశరావుకూడా చెప్పాడు! పరిస్థితులు ఆమెను ఎంతెంత అధోగతికి లాగివేసాయి! అదీగాక ఆమె అందమైన స్త్రీ..., యువతి! అటువంటి ఆమె ఒకరింట్లో, అందులో మోతుబర్ల యింట్లో పని చేస్తూందంటే పరిస్థితులు ఎటువంటి ప్రమాదానికి దారి తీస్తాయో? పరిస్థితులనుబట్టి ఆమె మనస్సు ఎలా మారుతుందో! చా! చా! ఆమె మీదలేనిపోని అపోహలేవిటి? ఆమె మనస్సు పవిత్రమైనది ఎందుకు కాకూడదూ? యింకా ఏదో ఏదో తలపోసుకుంటోంటే ప్రకాశరావు లేచాడు.

"ఏం...? శ్రీనివాసరావు! ఆమెస్థితికి విచారిస్తూన్నావనుకుంటాను! అవునా? ఎవరేంచేస్తారు? అది వాళ్ళ దురదృష్టం. ఈరోజున మనం యిలా కులాసాగా, హాయిగా వున్నాం. కాని రేపు మన పరిస్థితిఎలా వుంటాయో ఎవరు చెప్పగలరు...? పద వెళదాం యింటికి" అన్నాడు. నేనులేచాను నిరుత్సాహంగా.

మెట్లెక్కి గట్టుమీదకు వచ్చిన తరువాత ప్రకాశరావు భుజం తడుతూ "ఎలావుంది కథ...? విషాదంగా వుందికదూ? నీకు మంచి యితివృత్తం దొరికిందనుకుంటాను... ఈ రాత్రికే కథ అల్లెయ్యకూడదూ? పైగా నిజంగా జరిగిన కథ...!" అని.

కథరాయటానికి అందులో కొత్తదనం ఏముందని వ్రాయను? అటువంటి విషాదసంఘటనలతో

వున్న కథలు ఎన్నివందలులేవు? అయితే అది రాయడానికన్నా వింటానికి చాలా విషాదంగా వుంది. అంతే! కారణం అది నిజమైన యితివృత్తం కాబట్టి.

ఇదిజరిగిన తెల్లవారి పదిగంటలకు అత్యవసరమైన పనిమీద, అయిదురోజులు సెలవుపెట్టి వూరు వదలవలసి వచ్చింది నాకు. తెలంగాణ మీదుగా, బెజవాడకు వెళ్ళేటప్పుడూ, వచ్చేటప్పుడే కాకుండా, బెజవాడలోవున్న మూడు రోజులుకూడా ఆమెరూపమే గుర్తుకొచ్చేది ప్రతిసారీ. ఆమె సౌందర్యానికి, యౌవ్వనానికి ముగ్ధుడనై కాదు ఆమె రూపు గుర్తుకుతెచ్చుకుంట! ఆమెకథ, ప్రస్తుతం అనుభవిస్తూన్న క్లిష్టపరిస్థితి తలుచుకుంటే ఆమెమీద తెలియని అభిమానము, జాలి పుట్టుకొచ్చేవి.

అయిదవనాటి ఉదయ 7 గం॥ గోదావరిదాటి బెడ్డింగు పట్టించుకుని .యింటికివస్తూ వస్తూ, రెండు రోడ్లు కలసిన మూలవున్న ప్రకాశరావు మేడ వైపుచూచి తెల్లపోయాను.

ఆమె ఆ తెలంగాణాయువతి——మేడమీద కనిపించింది! గులాబివన్నె కోక గట్టింది! వాల్జెడ ముందుకు వేసుకుంది! సన్నజాజిపూలచెండు పెట్టుకుంది!...

నా కాశ్చర్యం వేసింది. ఈమె యిక్కడుందే? ప్రకాశరావు యింట్లో ఈమెకేంపని? బహుశ తొలిరోజుల్లో ఆదరించిన పరిచయమువల్ల వచ్చిందా? లేకపోతే యితనియింట్లోకూడా చిన్న చిన్న పనులు చేస్తోందా? పనిచేసుకుని బ్రతుకుతూంటే అంతఖరీదైన సిల్కుచీరలెక్కడివి? ఆమె వితంతువేమో? వాలెజడ—పైగా సన్నజాజిపూల చెండు..యింత ముస్తాబు దేనికి? బహుశ ఆమె...! ఏమో!! అయినా యింతమాత్రపుదానికే నేను ఆమెను చెడుగా ఎందుకర్థం చేసుకోవాలి?

యింటికి చేరుకున్న తరువాత ఈ విషయమే తలపోశాను ఆమెను గురించి. కాని ఏమీ అర్థం కాలేదు.

ప్రయాణ బడలికవల్ల వచ్చినవెంటనే ప్రకాశరావును కలుసుకోలేకపోయాను. ఉదయం 11గం॥ పడుకున్నవాణ్ణల్లా, సాయంత్రం మూడుగంటలకు లేచాను. కాఫీత్రాగి ప్రకాశరావుదగ్గరకెళదామనుకుంటూంటే అమ్మ గదిలోకొచ్చింది.

"మేము ఈవేళ ఆలయంలోకి వెళ్ళాలనుకుంటూన్నాం...మళ్ళీ అయిదు-అయిదున్నలోపులో వచ్చేస్తాను" అంది.

"వెళ్ళండి- మేమూ అటువైపే రావాలనుకుంటూన్నాము" అంటూ బయటకొచ్చేశాను.

అదృష్టవశాత్తు రోడ్డుమీదే తారసిల్లాడు ప్రకాశరావు. కాసేపు అటూ యిటూ తిరిగి, అయ్యరు హోటల్లో కాఫీత్రాగి బయటకొచ్చాం. యిందాక నేనుచూచిన దృశాన్ని గురించి అడగాలనుకున్నాను ప్రకాశరావును. అసలు మనస్సులో పీడించే విషయాన్ని బయటపెడితే తెలివితక్కువవాడిక్రింద కడతాడేమో ప్రకాశరావు. కనుక అసలువిషయం దాచివేశాను: "చూడు ప్రకాశరావ్...! అయితే ఆ తెలంగాణాయువతి మీ యింట్లోకూడా పనిచేస్తూ వుంటుందా? లేక పరిచయవల్ల వస్తూంటుందా? యిందాక నే వచ్చేటప్పుడు మీ మేడమీద చూచాను...అందుకని!"

ప్రకాశరావు నాకళ్ళల్లోకి సూటిగా చూచి నవ్వాడు.

"అవును—అప్పుడు చెప్పడం మర్చిపోయాను" అన్నాడు ముక్తసరిగా. యిక నేనేమీ మాట్లాడలేకపోయాను. ఇంకా ఏదో ఏదో అడుగుదామనుకున్నానుగాని అడగటానికి సాహసం చాలలేదు. ముందుముందైనా తెలియకపోతుందా ఆమె విషయం అని తృప్తిపడ్డాను.

ప్రకాశరావు కోవెలవైపు వెళదామన్నాడు. నేను గోదావరిదట్టుకు వెళ్ళి కాస్తసేపు కూర్చుని తరువాత వెళదామన్నాను. ప్రకాశరావు నాలో దాగివున్న భావాన్ని కనిపెట్టివేసిన వాడిలా నవ్వాడు.

"సాయంత్రమయిందికదూ? మళ్ళా తళతళ మెరిసే కూజాబిందె సాక్షాత్కరిస్తుందనా నీ ఆశ?" అన్నాడు నవ్వుతూ.

నేను సిగ్గుపడ్డాను దొరికిపోయినవాడిలా...నిజం చెప్పాలంటే నా ఉద్దేశ్యం అదికాదు!

గుడివేపే దారితీశాడు ప్రకాశరావు. నేనూ అతన్ని అనుసరించాను.

కోవెల్లో అడుగు పెట్టగానే ఏదో పవిత్రమైన భావాలు ప్రవేశించినట్లయినై మా మనసుల్లో. ఆలయంలో గంటలు మ్రోగుతూ పవిత్రమైన శబ్దాని కలుగజేస్తూన్నై.

పది పన్నెండు మెట్లెక్కి అప్రయత్నంగా తల పైకెత్తి చూచి నిర్ఘాంతపోయి నిలబడిపోయాను.

మెట్లుదిగి వచ్చే మొదటి ముగ్గురిలో మా అమ్మా, ప్రకాశరావుభార్యా, మరోఆమె ఎవరో కొత్తఆమె. వయస్సు మళ్ళిందే.

వాళ్ళకు వెనకాల—ఆమె... ఆ తెలంగాణా యువతి, ఆ పాపను చెయ్యిపట్టుకుని మెట్లు దింపుతూ తనుకూడా వయ్యారంగా దిగుతోంది మెట్లు. ఒకచేతిలో పూలసజ్జ, చిన్నసైజు వెండి పళ్ళెం వుంది.

ఈసారి ఆమె ముఖాన్ని పరీక్షగా చూచాను. ఇదివరకు కనిపించిన రెండు సన్నివేశాలకన్నా యిప్పుడు పరీక్షగా చూచే అవకాశం చిక్కింది. తలంటు పోసుకుందేమో జుట్టు ఎత్తుగా రేగి చెంపల నందుకుంటోంది, వదులువదులుగా జడ అల్లింది. పువ్వు లేమీ లేవు తల్లో. పసుపు పచ్చటి సిల్కుకోక కట్టుకుంది. దానిమీద అక్కడక్కడా వెండి చెమ్కిదారపు పూలు కుట్టివున్నాయి!... ముఖంలో విషాదచ్ఛాయలు వెతికిచూచినా కనిపించడం లేదు. లలాటంమ్మీద నాజూగ్గా పెట్టిన కుంకుమబొట్టు వుంది.

యిదేమిటి? ఆమె వితంతువు-మరి కుంకుమ పెట్టుకుందేం?

మా ప్రక్కనుంచే ఆమె వెళ్ళిపోయి, ప్రకాశరావు భార్యావాళ్ళతో కలిసి అంతర్ధానమైపోయింది.

ప్రకాశరావు భుజంమీద చెయ్యివేసి, స్పృశించగానే చాలా సిగ్గుపడ్డాను నాలో నేను. ఏమిటి? యింత తెలివితక్కువగా చూస్తూ నిలబడిపోయానే అమ్మావాళ్లు చూచారేమో నా ప్రవర్తన. ఆమె ఎంత నొచ్చుకుంటుందో యిలా నిర్ఘాంతపోయి చూస్తూ నిలబడిపోయినందుకు. నాలో యింత చంచలం కలిగించటానికి కారణం ఏమిటి? ఆమె స్థితికి, ఆమె వేషానికి ఎక్కడా సంబంధంలేదు. అదే! ప్రకాశరావు ఆలయం పైకి లాకువెళ్ళాడు. నేను మౌనంగా వుండిపోయాను దేన్నో తలపోస్తూ.

ఆలయం వెనకవైపున వున్న మెట్లుదిగి వచ్చేటప్పుడు ప్రకాశరావు నా ముఖంలోకి సూటిగా చూస్తూ ప్రశ్నించాడు. "చూడు శ్రీనివాసరావ్! నీకు ఎంత ఆశ్చర్యం కలిగితేమాత్రం అలా నిలబడిపోవచ్చా?" అని.

వెంటనే జవాబు యివ్వలేదు నేను. మెట్లు పూర్తిగా దిగి రోడ్డుమీద కాలుపెట్టిన తరువాత కాస్త సూటిగానే అడిగాను ప్రకాశరావును.

"అదికాదు—ఆమెల్లో ఆకర్షణ అలా వుంచి, ఆమె వితంతువు కదా? మరి బొట్టుపెట్టుకుందేం? ఆమె పరిస్థితికి, ఆమె అలంకరణకూ సంబంధం ఏముంది? ఆమెకు అంత ఖరీదైన సరికొత్త సిల్కు చీరెలెలావస్తాయి?" నిజం దాచకుండా చెప్పాలంటే 'అనుమానం' తీర్చుకునే ఉద్దేశ్యాన్ని వెల్లడి చేస్తూ అడిగాను.

ప్రకాశరావు ఏమనుకున్నాడో ఏమో మొఖాన్ని కొంచం ముడుచుకుని, వెంటనే ఆ స్థితి మార్చివేసి మామూలుగా నవ్వుతూ అన్నాడు. ఆ సమస్యలు తీరాలంటే కొన్నిరోజులు ఓపికపట్టు. వాటంతట అవే నివృత్త మవుతాయి."

ప్రకాశరావు మాటల్లో నిగూఢమైన భావం వుంది. నేను బలవంతంచెయ్యలేదు.

* * *

రాత్రి భోజనంచేసి అరుగుమీద పడకకుర్చీలో కూర్చున్నాను. అప్పుడు సుమారు 8-30 గంట అవుతుందేమో. మనస్సులో దేనికో భయంగానే వుంది. నేను ఈవేళ సాయింత్రం ఆలయంలో ఆమెకేసి చూస్తూ నిలబడిపోవటం బహుశా అమ్మ కనిపెట్టే వుంటుంది. మనస్సులో ఏమనుకుంటుందో నేను చేసిన తెలివితక్కువ పనికి... యింతవరకూ ఏమీ అడగలేదు. అదృష్టమనుకోవలసిందే!

"శ్రీనివాసరావ్!"

తల ఎత్తి చూచాను. అమ్మ నిలబడి వుంది నా ఎదురుగా చిరునవ్వుతో. "నువ్వు యింటిదగ్గరే పడుకుంటావు కదూ?"

అరుగుమీద చాపను కుర్చీదగ్గరకు లాగి కూర్చుంది అమ్మ యింకా ఏదో చెప్పడానికి గాబోలు.

"ఏమీ లేదు. ఈవేళ పౌర్ణమికదూ? ఆలయంలో హరికథ వుంది వెళదామని. ప్రకాశరావు

భార్యావాళ్ళు కూడా వస్తానన్నారు, వచ్చే వేళ కూడా అయింది" అని కొన్ని క్షణాలు ఆగి, అన్నట్టు యిందాక ఆలయంలో..."అని నా వంక పరీక్షగా చూసి నవ్వింది అమ్మ. నాకు గుండె గొంతుకలోకి వచ్చింది. ఇంకా సంబాళించుకోక ముందే అందుకుంది అమ్మ, "ఆ అమ్మాయిని చూచావు కదూ? బహుశ ప్రకాశరావు నీతో చెప్పే వుంటాడు ముందుగానే" కొంచం తీరికైనది మనస్సు.

అవును-ఆమె చరిత్ర అమ్మకి కూడా తెలిసి వుంటుంది. అందుకనే సానుభూతిగా చెబుదామను కుంటోంది గాబోలు నాతో...కాని నాకు ఏనాడో తెలిసింది ఆమె కథ ప్రకాశరావువల్ల.

నేను ఒక నిట్టూర్పు విడిచి అన్నాను: "అవును పాపం! తెలుసు-ఆమె మూగది. రజాకార్ల దోపిడీలో వాళ్ళ తండ్రి, భర్తవాళ్ళు పోయా రటగా. కాందిశీకులుగా యిక్కడకు వచ్చి రెండు సంవత్సరాలవుతుందట. పాపం ఆమె భర్త ఈ హాస్పిటల్ లోనే మరణించాడట! ఆ పాప! ఆమె కూతురు. చక్కగా వుంటుంది. కానీ ఏంలాభం?" నా ధోరణి ముగియగానే అమ్మ నివ్వెరపోయింది. ఒక్కసారిగా నావంక పిచ్చిగా చూసింది.

"ఏ అమ్మాయిగురించిరా నువ్వు చెప్పేది....?"

"అదే మీావెనకాల పాపను మెట్లు దింపించ లేదూ...? పూలసజ్జ పట్టుకుందీ...? ఆమెగురించే!!"

ఈసారి మరీ పిచ్చిదైపోయింది అమ్మ...!

"నీకు మతిపోయిందా శ్రీనివాసరావ్? ఆమె మూగది ఏమిటీ...? తెలంగాణా ప్రాంతంనుంచి వలసరావటం ఏమిటి? ఆమె భర్తనీ తండ్రినీ హత్య చేయటం ఏమిటీ...? ఆమె కూతురు ఏమిటి? ఇదె క్కడి అఘాయిత్యంరా నాయనా? నీ కెవ్వరు చెప్పేరు యిలాగనీ...!"

అమ్మ ధోరణి చూస్తే నాకు మాట రాలేదు. మెల్లగా సద్దుకుని అన్నాను ఎలాగో.... "ప్రకాశ రావు...!" అని.

అమ్మ సంగతంతా గ్రహించినదానిలా ఒక్క సారిగా నవ్వాలనుకుంది. అయితే అనుకున్నంతగా నవ్వలేకపోయింది.

"ప్రకాశరావా...? అలాచెప్పు— ఇప్పటినుంచే నిన్ను ఆడిస్తూవున్నాడన్నమాట! ఆమె ప్రకాశరావు చెల్లెలు!! అంటే వైజాగ్ లో ఉన్నవాళ్ళ బాబాయి యొక్క కూతురు! ఆ పాప ఆమె చిన్నచెల్లెలు...! అయినా ప్రకాశరావు మాత్రం ఎలా చెప్పేడు? హాస్యానికైనా అంత దారుణమా?" అని కొన్ని క్షణాలు ఆగి "యిక్కడేవైనా మంచి సంబంధా లుంటే చూద్దామని వెంటపెట్టు కొచ్చింది ఆమె తల్లి! మా వెంటవున్న మూడో ఆమె లేదూ? ఆమె తల్లే! ఆ అమ్మాయిని నీకు యిద్దామనుకుంటు న్నారు! చదువుకుంది. ఏమంటావు నువ్వు? ఆ అమ్మాయికేం చాలా అందంగావుంది!" యిదంతా మా అమ్మ చెబుతోంటే నాకు ఆనందం కలుగ లేదు. ఉత్సాహం ఉబుకలేదు...సిగ్గుపడలేదు! అయితే ప్రకాశరావు చమత్కారానికి, ఆశ్చర్య పోయాను. యిటువంటి విషయాల్లో అంత ధైర్యంగా కథను కల్పించి చెప్పడమనేది చాలా సాహసంతో కూడినపని. అయినా ప్రకాశరావు ఆమెమీాద అటువంటి కథను అల్లడంలో కొద్దిగా కూడా జంకలేదే? ఏం మనిషి అతను?

యింతలోనే బయటనుంచి ఎవరో కేకవేసారు అమ్మను ఎవరిదా కంఠం? బహుశా ఆమెదే! ఆ తెలంగాణా యువతి—కాదు. ప్రకాశరావు చెల్లెల్ది! ఆమెకు తగ్గట్టే వుంది స్వరం!

ఏవో గుర్తుకొచ్చినట్టె వెంటనే ఉలిక్కిపడ్డాను: అయితే నామీాదకూడా ఏదన్నా కట్టుకథను కల్పించి చెప్పింవుంటాడా ఆమెతో?

---

చదువుతున్న వార్తాపత్రిక మడిచి భార్య భర్తతో అన్నది: "చూశారా, ఎవరో కాలేజీ అమ్మాయి తను "నదిలో మునిగిపోతూంటే రక్షించిన యువకుణ్ణే పెళ్ళి చేసుకుందిట."

భర్త జవాబు: "ఆ కుర్రాడెవరో తనదారిన తను పోకండా అనవసర విషయాల్లో జోక్యం చేసుకుంటే ఏమవుతుంది మరి!"